



నక్కపల్లిలో ఉదయం 5-45 గంటలకే భానుడి ప్రతాపం

# భగ్గుమన్న భానుడు... కరుణించిన వరుణుడు



అనకాపల్లిలో జనసందడి లేని గాంధీనగరం రోడ్డు

**జిల్లాలో ఒకే రోజు విభిన్న వాతావరణం**

- అనకాపల్లి, ఎలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, పరవాడ ఇతర మండలాల్లో మండిన ఎండ
- మాడుగుల, గొలుగొండ, రావికమతం తదితర మండలాల్లో వర్షం



గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో జోరున వర్షం కురుస్తున్న దృశ్యం

**అనకాపల్లి టౌన్/ నక్కపల్లి/ పరవాడ/ రావికమతం మాడుగుల/కృష్ణాదేవిపేట, మే 18:**
సూర్యోదయం నుంచే భానుడి భగభగలతో శనివారం జిల్లా వాసులు అల్లాడిపోయారు. గత రెండు మూడు రోజులుగా కాస్త చల్లని వాతావరణానికి అలవాటు పడిన జనం ఒక్కసారిగా పెరిగిన ఎండతో తల్లడిల్లారు. రెండు రోజులుగా 30 నుంచి 34 డిగ్రీల మధ్య నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతలు శనివారం 36.5 డిగ్రీలకు పెరగడం, దానికి తోడు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. పది గంటలు దాటిన తరువాత బయటకు వచ్చేందుకు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. మాడుగుల మండలంలో ఉదయం నుంచి ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన ప్రజలు మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారిపోయి తేలికపాటి వర్షం కురవడంతో ఉపశమనం చెందారు. మండలంలోని పలు గ్రామాల్లో ఓ వైపు వర్షం కురుస్తుండగానే, మరో వైపు ఎండ కాయడంతో ఇదెక్కడి వాతావరణమంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, కొంగసింగి, చోద్యం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో రెండు రోజులుగా వాతావరణం చల్లబడింది. అడపాదడపా కురుస్తున్న మోస్తరు వర్షంతో ప్రజలు ఊరట చెందారు.

శనివారం పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం పడింది. ప్రధాన రహదారులు బురదమయ్యాయి. ఏఎల్‌పురం ఆర్టీసీ బస్‌స్టేషన్ చెరువును తలపిస్తోంది. ఉదయం నుంచి భానుడి ప్రతాపంతో అల్లాడిన రావికమతం మండల వాసులు శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో సేద తీరారు. అపరాలు విత్తుకోవడానికి అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వేసవి దుక్కులకు వీలుగా ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది.

# సరకులు కొంటేనే ఆసరా !

- పథకం నిధులు జమ చేసేందుకు లింకు
- డ్వాక్రా మాల్‌లో కనీసం రూ.500 సరకులు తీసుకోవాలని ఐకేపీ సిబ్బంది షరతు
- లబోదిబోమంటున్న డ్వాక్రా మహిళలు
- డిమాండ్ చేయడం లేదంటున్న ఏపీఎం



ఎస్.రాయవరంలోని డ్వాక్రా మాల్

**పాయకరావుపేట, మే 18:**
పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 'ఆసరా' పథకం నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమకావాలంటే డ్వాక్రా మాల్‌లో సరకులు కొనుగోలు చేయాల్సిందేనని ఐకేపీ సిబ్బంది కండిషన్ పెడుతుండడంపై డ్వాక్రా మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవసరం ఉన్నా లేకున్నా సరకులు ఎలా కొనుగోలు చేస్తామని, అయినా ప్రభుత్వం ఇచ్చిన నిధులపై వీరి పెత్తనమేమిటని ప్రశిస్తున్నారు.

పాయకరావుపేట మండలంలో 1,830 డ్వాక్రా సంఘాల సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా నాల్గో విడత సాయంగా ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో రూ.16.3 కోట్లు విడుదల చేసింది. అయితే ఇప్పటివరకు ఆ నిధులు డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాలకు జమకాకపోవడంతో డబ్బులు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు నిధులు విడుదల కాలేదని, పోలింగ్ ముగిసిన తరువాత వస్తాయని ఐకేపీ సిబ్బంది చెబుతూ వస్తున్నారు. కాగా ఈనెల 13న పోలింగ్ ముగియడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దీంతో డ్వాక్రా సంఘాల పొదుపు ఖాతాలకు ఆసరా నిధులు జమయ్యాయి. అయితే ఈ నిధులను డ్వాక్రా సభ్యుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేయాల్సి ఉంది.

**ఇక్కడే అసలు మెలిక...**

ప్రతి మహిళకూ ఆసరా నిధులు అందాలంటే ఎస్.రాయవరం మండలంలో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాల్‌లో కనీసం రూ.500 సరకులు కొనుగోలు చేసి రశీదు చూపాలని ఐకేపీ సిబ్బంది మెలిక పెట్టారు. దీంతో మహిళలు లబోదిబో మంటున్నారు. తమకు అవసరమైనపుడు సరకులు కొనుగోలు చేసుకుంటామని, ఐకేపీ సిబ్బంది ఇలా బలవంతం చేయడం సరికాదని పలువురు వాపోతున్నారు. దీనిపై ఐకేపీ ఏపీఎం రాజుబాబును వివరణ కోరగా మహిళలంతా తప్పనిసరిగా సరకులు కొనాలని తాము చెప్పలేదన్నారు. డ్వాక్రా మాల్‌లో సరకుల అమ్మకాలకు సంబంధించి సిబ్బందికి టార్గెట్లు విధించడంతో మోటివేషన్ కోసం కొనుగోలు చేయమని మాత్రమే సిబ్బంది అడుగుతున్నారని వివరించారు. ఆసరా నిధులు విడుదలకు సంబంధించి ఐకేపీ సిబ్బంది ఇబ్బంది పెట్టినా, డబ్బులు డిమాండ్ చేసినా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

# ఖరీఫ్‌కు సాగు ప్రణాళిక!

## ముందస్తు చర్యల్లో వ్యవసాయ యంత్రాంగం

- విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు
- జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు
- వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తాయని అంచనా



(అనకాపల్లి, ఆంధ్రజ్యోతి)
జిల్లాలో ఖరీఫ్ పంటల సాగుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులపై ఓ అంచనాకు వచ్చిన అధికారులు ముందస్తు చర్యల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వేసవి దుక్కులు పూర్తిచేస్తున్నారు. మే రెండో వారం నుంచే వాతావరణంలో వస్తున్న మార్పులు ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సాగు నీటి కష్టాలు తొలగించేలా ఉన్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని 24 మండలాల పరిధిలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1.85 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగుకు అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఇందులో వరి ప్రథమ స్థానంలో నిలవనుండగా, చెరకు సాగు రెండో స్థానం దక్కించుకుంటుందని చెబుతున్నారు. జిల్లాలో తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార షుగర్ ఫ్యాక్టరీలు మూతపడడంతో గత కొద్ది సంవత్సరాలుగా చెరకు సాగు విస్తీర్ణం తగ్గుతోంది. గత ఏడాది చెరకు సాధారణ సాగు విస్తీర్ణం 60 వేల ఎకరాలు కాగా, ఈ ఏడాది 48,677 ఎకరాలకు పడిపోయింది. అదే స్థాయిలో వరి సాగు చేస్తున్న రైతుల సంఖ్య పెరుగుతోంది.

**పంటల లెక్కలివీ...**

జిల్లా వ్యాప్తంగా వరి 1.41 లక్షల ఎకరాలు, చెరకు 37,500 ఎకరాలు, సజ్జలు 2,250 ఎకరాలు, మొక్కజొన్న 200 ఎకరాలు, కందులు 375 ఎకరాలు, పెసర 625 ఎకరాలు, మినుములు 625 ఎకరాలు, వేరుశనగ 250 ఎకరాలు, నువ్వులు 2,125 ఎకరాలు, పత్తి 375 ఎకరాల్లో సాగు చేసే అవకాశాలున్నాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో భాగంగా ఖరీఫ్ సీజన్‌కు 23,678 క్వింటాళ్ల ... మిగతా 8వ పేజీలో



**కన్యకాపరమేశ్వరికి లక్ష మల్లెల అర్చన**

కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకల్లో భాగంగా అనకాపల్లిలోని అమ్మవారి ఆలయంలో శనివారం లక్ష మల్లెలతో ప్రత్యేక పూజలు చేశారు.

# మామిడిపై రసాయనాలు

- 24 గంటల్లో రంగు మార్పు
- అటువంటి పండ్లను తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం
- స్వల్ప కాలంలో తలనొప్పి, మానసిక గందరగోళం, జ్ఞాపకశక్తి నశించడం, మానసిక స్థితి నిలకడగా లేకపోవడం,
- నిద్రలేమి వంటి సమస్యలు
- దీర్ఘకాలంలో కేన్సర్, మూర్ఛ బారినపడే ప్రమాదం
- 20 నుంచి ప్రత్యేక డ్రైవ్‌కు ఆహార, భద్రతా ప్రమాణాల శాఖ అధికారులు సన్నద్ధం
- ఇథలిన్ 100 పీపీఎం దాటినట్టు తేలితే కేసు నమోదు.. జరిమానా, జైలు శిక్ష




(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
వేసవి వచ్చిందంటే ప్రతి ఒక్కరూ తీసుకునే పండ్ల జాబితాలో మామిడి తప్పక ఉంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం దిగుబడి తక్కువగా ఉండడంతో మార్కెట్‌లో పండ్ల లభ్యత తక్కువగా ఉంది. డిమాండ్ అధికంగా ఉండడంతో వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి వాటిని కృత్రిమ పద్ధతిలో మగ్గబెట్టి విక్రయాలు సాగిస్తున్నారు. అయితే, కృత్రిమంగా రసాయనాలు పిచికారీ చేయడం ద్వారా మగ్గబెట్టిన పండ్లు ఆరోగ్యానికి హానికరమని వైద్యులు చెబుతున్నారు.

**ఇథలిన్ వినియోగం ద్వారా పక్వానికి...**

సాధారణంగా మామిడి కాయ పండడానికి చాలా రోజులు సమయం పడుతుంది. ఈ క్రమంలో కొన్ని కుళ్లిపోవడం జరుగుతుంది. ఆ నష్టాన్ని తగ్గించుకునేందుకు వ్యాపారులు రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇథలిన్‌ను వినియో గించడం ద్వారా 24 గంటల నుంచి 48 గంటల్లో కాయ రంగు మారిపోతుంది. ఇథోపాన్ నుంచి ఇథలిన్ గ్యాస్ వస్తుంది. ఈ గ్యాస్ ద్వారా కాయలు పండ్లుగా చేయవచ్చు. కానీ, వ్యాపారులు ఇథోపాన్‌ను లిక్విడ్ రూపంలో తీసుకువచ్చి నేరుగా పండ్లపై స్ప్రే చేస్తున్నారు. ఇది అత్యంత ప్రమాద కరమని అధికారులు చెబుతున్నారు. పండ్లపై ఇథలిన్ 100 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్)కు మించి ఉండకూడదు. కానీ, నేరుగా స్ప్రే చేయడం వల్ల పీపీఎం పరిధికి మించి ఉంటోంది. దీనివల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఇథలిన్‌తో పాటు కాల్షియం కార్బైడ్‌ను వ్యాపారులు వినియోగిస్తుంటారు. గతంలో దీని వినియోగం చాలా ఎక్కువగా ఉండేది. ఇప్పుడు కాస్త తగ్గినప్పటికీ కొన్నిచోట్ల వ్యాపారులు వినియోగిస్తున్నట్టు చెబుతున్నారు. మామిడి కాయలను చెట్ల నుంచి దించిన తరువాత వాటిని లారీలో వేసుకుని తీసుకువచ్చే సమ యంలో పండ్లుగా మారుస్తున్నారు. కాయల మధ్యలో కాల్షియం కార్బైడ్‌ను పొట్లాల రూపంలో పెట్టించి మగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. కార్బైడ్ ఆర్సినిక్, పాస్ఫరస్‌లు ఆక్సిజన్‌తో కెమికల్ రియాక్షన్ జరిగి ఎసిటిలిన్ అనే గ్యాస్ విడుదలవుతుంది. ఎసిటిలిన్ గ్యాస్ వల్ల మామిడికాయ త్వరగా రంగు మారడంతోపాటు మెత్తపడుతుంది. ఈ ఎసిటిలిన్ ... మిగతా 8వ పేజీలో



రసాయనాలతో మగ్గబెట్టిన మామిడి పండ్లు

# విదేశీ ఉద్యోగాల పేరిట మోసం

**కాంబోడియా తరలించి చైనా ముఠాలకు విక్రయం**




- అక్కడ సైబర్ నేరాలపై శిక్షణ...
- భారతీయులకు ఫోన్‌లు చేయించి రూ.కోట్లు దోపిడీ
- చెప్పిన పని చేయకుంటే... చీకటి గదుల్లో బంధించి చిత్రహింసలు
- అక్కడ నుంచి తప్పించుకున్న నగర యువకుడు
- వివరాలు వెల్లడించిన సీపీ రవిశంకర్ అయ్యనార్

-7లో

# పదికి కొత్త సిలబస్

**సీబీఎస్ఈకి అనుబంధంగా పాఠ్యాంశాల రూపకల్పన**

- ఏడు పుస్తకాల స్థానంలో 11 పాఠ్య పుస్తకాలు
- విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే ధ్యేయమంటున్న విద్యాశాఖాధికారులు



మారిన సిలబస్‌తో పుస్తకాలు

**నర్సీపట్నం, మే 18:**
నూతన విద్యా విధానాన్ని అమలుచేస్తున్న ప్రభుత్వం రానున్న విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టనుంది. ఇందులో భాగంగా నూతన పాఠ్యాంశాలతో కూడిన పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు చేరుతున్నాయి. గత ఏడాది తొమ్మిదో తరగతిలో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయడంతో దానికి కొనసాగింపుగా ఈ ఏడాది పదో తరగతి సిలబస్ మొత్తాన్ని ప్రభుత్వం మార్చివేసింది. పాత సిలబస్‌కు భిన్నంగా విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని మెరుగుపరిచేలా కొత్త సిలబస్‌లో పాఠ్యాంశాలు ఉంటాయని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వం పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేసిన వైసీపీ ప్రభుత్వం గత ఏడాది తొమ్మిదో తరగతి నుంచి ప్రయోగాత్మకంగా కొత్త పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ విద్యార్థులంతా ఈ ఏడాది పదో తరగతిలోకి వస్తుండడంతో సిలబస్ కొనసాగింపుగా సీబీఎస్ఈని పోలే విధంగా పాఠ్యాంశాలు రూపొందించారని అధికారులు తెలిపారు. పాత సిలబస్‌లో తెలుగు, లెక్కలు, ఆంగ్లం, సైన్స్, సోషల్, హిందీ టెక్ట్స్ బుక్స్ ఉండేవి. కొత్త సిలబస్‌లో 11 రకాల టెక్ట్స్ పుస్తకాలు ఉన్నాయి. తెలుగు వాచకం, ఉపవాచకం, జీవశాస్త్రం, జియోగ్రఫీ, సోషల్ హిస్టరీ, ఎకనామిక్స్, డెమొక్రటిక్ పాలిటిక్స్, గణిత శాస్త్రం, హిందీ వాచకం, ఉప వాచకం ... మిగతా 8వ పేజీలో

# టీఎస్ ఎంసెట్‌లో విశాఖ విద్యార్థుల జోరు

- ఇంజనీరింగ్‌లో ఫస్ట్ ర్యాంకు
- 200లోపు ఎనిమిది...
- అగ్రికల్చర్, ఫార్మశీలో 200లోపు ఏడు ర్యాంకులు



ఎస్.జ్యోతిరాదిత్య (1వ ర్యాంకు)



దనుకొండ శ్రీనిధి (10వ ర్యాంకు)

**విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ ఎంసెట్-2024లో విశాఖ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. నగరంలోని శ్రీచైతన్య విద్యా సంస్థలో చదువుకున్న పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన ఎస్.జ్యోతిరాదిత్య ఇంజనీరింగ్ విభాగంలో ప్రథమ ర్యాంకు సాధించాడు. జ్యోతిరాదిత్యకు 160కి 155.63 మార్కులు వచ్చాయి. శ్రీచైతన్య విద్యార్థులు పలువురు అటు ఇంజనీరింగ్, ఇటు అగ్రికల్చరల్/ఫార్మశీ విభాగాల్లో 200 లోపు ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో ధనుకొండ శ్రీనిధి (10వ ర్యాంకు), రెడ్డి అనిల్ (47వ ర్యాంకు), ఎం.సాయిశివలోచన్ (72వ ర్యాంకు), ఎం.మణికంఠ పృధ్వీరాజ్ (90), భేరి సాహితి (125), ఆళ్ల రామలింగం నాయుడు (129)... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

## వివాహిత ఆత్మహత్య


తమరాన శ్రావణి (ఫైల్)

బుచ్చెయ్యపేట, మే 18 : అత్తవారి ఇంట్లో వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. మండలంలోని లింగభూపాలపుర అగ్రహారానికి చెందిన తమరాన శ్రావణి (28)కి అదే గ్రామానికి చెందిన రేణుకృష్ణతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. భర్త ఢిల్లీలో బీఎస్ఎఫ్ జవానుగా పనిచేస్తున్నాడు. వీరికి ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. శ్రావణి అత్తవారింట్లో ఉంటుంది. శుక్రవారం రాత్రి ఆమె ఇంటి పనులు పూర్తిచేసుకుని నిద్రపోతానని చెప్పి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న ఆమె తండ్రి కొల్లి నాయుడుబాబు అక్కడికి చేరుకున్నారు. తన కుమార్తె శ్రావణిని మరిది, తోటికోడలు, ఆడపడుచు చీటికి, మాటికి వేధింపులకు పాల్పడడంతోనే ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

## ఆటో బోల్తా పడి యువకుడి మృతి


అప్పన్న (ఫైల్)

పరవాడ, మే 18 : మండలంలోని దలాయిపాలెం ప్రధాన రహదారిలోని రామచంద్రమ్మ అమ్మవారి గుడి సమీపంలో శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఇందుకు సంబంధించి సీఐ బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముత్యాలమ్మపాలెం పంచాయతీ దిబ్బపాలెం గ్రామానికి చెందిన చింతకాయల అప్పన్న, ముత్యాలు కలిసి శుక్రవారం రాత్రి దలాయిపాలెంలో గల ఉప్పుగల్లి కూలీలను తీసుకురావడానికి ఆటోలో బయలుదేరి వెళ్లారు. సరిగ్గా ఆటో రామచంద్రమ్మ అమ్మవారి ఆలయానికి సమీపంలోకి వెళ్లే సరికి అదే రహదారిలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న చింతకాయల అప్పన్న (23) తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆటో వెనుక కూర్చున్న ముత్యాలు ప్రమాదం నుంచి చాకచాక్యంగా తప్పించుకున్నాడు. ప్రమాద విషయాన్ని అతడు అప్పన్న కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే అప్పన్నను 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య దుర్గారాణి ఉన్నారు. అప్పన్న మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బాబోయ్.. కోతులు కోకొల్లలు

## బుచ్చెయ్యపేట మండలాన్ని వీడని వానరాల బెడద

**బుచ్చెయ్యపేట.. ఒకప్పుడు ఈ మండల రైతాంగానికి ఎటువంటి సమస్యలు ఉండేవి కావు. కష్టపడి వ్యవసాయం చేసుకోవడం.. పండిన పంటలను విక్రయించుకుని ఆనందంగా గడపడం వరకే తెలిసేది. కానీ దశాబ్ద కాలంగా వీరికి వానర మూకల రూపంలో కష్టాలు వెంటాడుతున్నాయి. ఇవి ఇంతింతై.. వటుడింతై... అన్నట్టు పదుల సంఖ్యతో ప్రారంభమైన ఈ కోతుల సంఖ్యల నేడు పది వేలకు పైబడి చేరింది. దీంతో పంటలను పాడు చేస్తున్నాయి. ఇళ్లలోని సామగ్రిని విసిరి పారేస్తున్నాయి. ఒంటరిగా కనిపించిన వారిపై దాడికి తెగబడుతున్నాయి. ఇలా.. వీటి చేష్టలతో అన్నదాతలు ప్రత్యక్ష నరకరాన్నే చూస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే కాస్త హడావుడి చేసి... ఆ తరువాత చేతులెత్తేశారన్న వాదన అన్నివర్గాల నుంచి వినిపిస్తోంది.**

- నాడు పదుల సంఖ్యలో... నేడు పది వేలకు పైబడి చేరిక
- పంటలు పాడుచేస్తుండడంతో రైతులు గగ్గోలు
- కాగితాలకే పరిమితమైన నివారణ చర్యలు


గంటికొర్లాం గ్రామంలోని కోసిన వరి పొలంలో కోతుల గుంపు (ఫైల్)

బుచ్చెయ్యపేట, మే 18: దశాబ్ద కాలంగా మండలాన్ని పట్టిపీడిస్తున్న కోతుల బెడద వీడడం లేదు. రోజురోజుకు ఈ సమస్య పెరుగుతుందే తప్ప.. తగ్గడం లేదు. స్వయానా ఎమ్మెల్యే ధర్మశ్రీ ఇచ్చిన హామీ సైతం కాగితాలకే పరిమితం కావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని వడ్డాది, లోపూడి, ఎల్‌బీపీ అగ్రహారం, ఎల్.సింగవరం, పొట్టిదొరపాలెం, కోమళ్లపూడి, గంటికొర్లాం, కొండెంపూడి, కేపీఅగ్రహారం, కొండపాలెం, దిబ్బిడి, చినప్పన్నపాలెం, పి.భీమవరం గ్రామాల్లో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట కోతులు పాలవుతోంది. దీంతో రైతులు బావురుమంటున్నారు. కోతుల దెబ్బకు ఏటా రూ.నాలుగు కోట్లు పంట నష్టాన్ని చవిచూస్తున్నారు. 14 గ్రామాల్లో రైతులు పండిస్తున్న వరి, చెరకుతో పాటు ఉద్యానవన పంటలైన అరటి, కొబ్బరి, మామిడి, జామ, చింత, ఆయిల్ పామ్, జీడిమామిడి, పుచ్చకాయ, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు పంటలను కోతులు ధ్వంసం చేస్తున్నాయి. వీటి బెడద నుంచి తప్పించుకోవడానికి చెరకుతో పాటు వరి, కూరగాయలు, ఉద్యాన పంటలకు రైతులు స్వస్తిపలకి, ప్రత్యామ్నాయంగా సరుగు సాగును ఆశ్రయించడంతో ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఇదే ప్రధాన పంటగా మారింది.


ఏడాది క్రితం బంగారుమెట్టలో బోనుల ద్వారా పట్టుకున్న కోతులు

**రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే ధర్మశ్రీ హామీ**

ఒకప్పుడు వందల సంఖ్యలో ఉండే కోతుల సంఖ్య నేడు పది వేలకు పైగా చేరుకుందని తెలుస్తోంది. ఈ సమస్యను నివారించాలని మండల రైతులు రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులతో పాటు చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి పలుమార్లు విజ్ఞప్తులు చేశారు. ఈ మేరకు 2022 నవంబరులో కోతుల సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.50 లక్షల నిధులు సమీకరిసానని బంగారుమెట్టలో జరిగిన రైతుల సమావేశంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రకటించారు. అనకాపల్లి ఎంపీ, విశాఖ డెయిరీ, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ, జిల్లా కలెక్టర్ జనరల్ ఫండ్ నిధులతో పాటు మండలంలోని పలు పంచాయతీల నుంచి ఈ మొత్తం సేకరించనున్నట్టు నాడు తెలిపారు.

**రెండు వేల కోతులను పట్టుకున్న అగ్గి రాముడు బృందం**

ఇదిలావుంటే, తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కోరుకొండ గ్రామానికి చెందిన అగ్గిరాముడు బృందంతో ఒక కోతిని పట్టుకోవడానికి రూ.400లు చొప్పుల ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో సదరు బృందం బోనులు ఏర్పాటు చేసి సుమారు రెండు వేల కోతులను పట్టుకున్నారు. పట్టుకున్న కోతులకు నగదు చెల్లించాలని అగ్గి రాముడు అధికారులను, నాయకులను కోరాడు. వడ్డాది, లోపూడి, ఎల్.సింగవరం, పి.భీమవరం, రాజాం, పొట్టిదొరపాలెం, కోమళ్లపూడి, కొండెంపూడి, గంటికొర్లాం, కందిపూడి, చినఅప్పన్నపాలెం, దిబ్బిడి తదితర పంచాయతీల నుంచి వసూలు చేసిన సుమారు రూ.5 లక్షల్లో మూడున్నర లక్షలను అతడికి ఇచ్చారు. మిగిలిన రూ.లక్షన్నర కోతులను ఏజెన్సీ ప్రాంతంలో వదలడానికి ఖర్చు చేశారు. దీనిపై అగ్గిరాముడు మాట్లాడుతూ పట్టుకున్న కోతులకు సంబంధించి తనకు రూ.8 లక్షలు రావాల్సి ఉందని, రూ.3.5 లక్షలు రోజువారి ఖర్చులకే సరిపోయిందని, మిగతా నగదు ఇవ్వాలని పంచాయతీ అధికారులను, అధికార పార్టీ నాయకులను కోరాడు. ఎంపీ, జిల్లా జనరల్ ఫండ్, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ, విశాఖ డెయిరీల నుంచి కోతుల పట్టడానికి నిధులు మంజూరుకు నిబంధనలు ఆటంకంగా మారడంతో నిధులు మంజూరు చేయలేమని చేతులెత్తేశారు. దీంతో కోతుల పట్టివేత కార్యక్రమం అర్ధంతరంగా నిలిచిపోయింది.

**బకాయిలు ఇప్పించి ఆదుకోండి**



బృందంలోని 25 మంది కలిసి పట్టుకున్న రెండు వేల కోతులకు సంబంధించి రూ. ఎనిమిది లక్షలు రావాల్సి ఉంది. ఇందులో రూ.3.5 లక్షలు మాత్రమే ఇచ్చారు. మిగిలిన రూ.4.5 లక్షల కోసం నాలుగు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. బకాయి నగదు వచ్చేలా ఎమ్మెల్యే అధికారులు ఏర్పాట్లు చేయాలి.

- అగ్గి రాముడు,
కోతుల పట్టే బృందం నాయకుడు

## వైసీపీ దౌర్జన్యాల కట్టడిలో పోలీసులు విఫలం

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధ నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, మే 18 : రాష్ట్రంలో వైసీపీ నాయకులు, కార్యకర్తల దౌర్జన్యాలను అరికట్టడంలో పోలీస్ శాఖ పూర్తిగా విఫలమైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు ఆరోపించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీకి ఓటు వేశారన్న అక్కసుతో వైసీపీ నేతలు విశాఖలో దాడులకు దిగి రక్తపాతం సృష్టించడం దారుణమన్నారు. జీవీఎంసీ 49వ వార్డు బర్మాక్యాంప్‌లో నివాసముంటున్న సుంకర ధనలక్ష్మి కుటుంబంపై వైసీపీ మూకల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేవలం ఓటమి భయంతోనే వైసీపీ గుండాలు టీడీపీ మద్దతుదారులపై దాడులకు దిగుతున్నారన్నారు. ప్రశాంత వాతావరణానికి చిరునామా అయిన విశాఖ నగరంలో పోలీస్ యంత్రాంగం మేలుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఎస్‌కె బాబర్, బుద్ధ కాశీ, కాంద్రేగుల సత్యనారాయణ, సిద్ధిపేట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్- 2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, మే 18: గ్రూప్- 2 ప్రిలిమినరీ పరీక్షల్లో పాసై, మెయిన్స్‌కు సిద్ధమవుతున్న ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె. శ్రీదేవి తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 22వ తేదీలోగా పంపించాలని, 60 మందికి రెండు నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామని చెప్పారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన ఏడుగురు అభ్యర్థులతో పాటు మిగిలిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదో తరగతి, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధృవీకరణ (వార్షిక ఆదాయం రూ. లక్ష లోపు) పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ జెరాక్స్, రెండు ఫొటోలు, గ్రూప్- 2 హాల్ టికెట్ జతపరిచి బీసీ స్టడీ సర్కిల్, ఎంవీపీ కాలనీ, సెక్టర్ 6, విశాఖపట్నం కార్యాలయానికి నేరుగా పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు 94925 69177 ఫోన్ నెంబరులో సంప్రతించాలని ఆమె సూచించారు.

## మరికొన్ని ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, మే 18: వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా నడుస్తున్న మరికొన్ని ప్రత్యేక రైళ్లను కొద్ది రోజులపాటు పొడిగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా సంబల్‌పూర్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (08321) ఈనెల 30 నుంచి జూన్ 27 వరకు, ఎస్ఎంవీ బెంగళూరు-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను (083 22) జూన్ ఒకటి నుంచి 29 వరకు, సంబల్‌పూర్-కాచీగూడ ఎక్స్‌ప్రెస్ ను (08325) ఈనెల 27 నుంచి జూన్ 24 వరకు, కాచీగూడ-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను (08326) ఈనెల 28 నుంచి జూన్ 25 వరకు పొడిగించినట్టు ఆయన పేర్కొన్నారు.

**మళ్లింపు మార్గంలో హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్**

అంబాల డివిజన్‌లోని శంభుస్టేషన్ వద్ద కిసాన్ ఉద్యమం జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 21న విశాఖ నుంచి అమృతసర్ వెళ్లే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20807), తిరుగు ప్రయాణంలో ఈనెల 22న అమృతసర్ నుంచి విశాఖ వచ్చే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20808) రైళ్లు వయా ఉత్తర రైల్వేలోని జఖాల్, ధురి, లుధియానా మీదుగా మళ్లింపు మార్గంలో రాకపోకలు సాగిస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్లు రానుపోను మార్గంలోని పానిపట్, అంబాల స్టేషన్లకు చేరవని పేర్కొన్నారు.

## 2న ఐటీఐ బ్రిడ్జి కోర్సు అభ్యర్థులకు పరీక్షలు

కంచరపాలెం, మే 18 : ఐటీఐ కోర్సులు పూర్తిచేసి బ్రిడ్జి కోర్సు శిక్షణ తీసుకున్న అభ్యర్థులు డిప్లొమా ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు గాను వచ్చే నెల 2వ తేదీన పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను సాంకేతిక శాఖ విడుదల చేసింది. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో పరీక్ష ఉంటుంది. రాష్ట్రంలో ఈ పరీక్షలకు మూడు పరీక్ష కేంద్రాలను కేటాయించింది. జోన్ పరిధిలో విశాఖపట్టణం కంచరపాలెంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంగా పరీక్షలు జరగనున్నాయి. బ్రిడ్జి కోర్సు ప్రాక్టికల్స్ పాసైన అభ్యర్థులు ఈ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అర్హులైన అభ్యర్థులు రూ.400 ను ఆన్‌లైన్ ద్వారా చెల్లించడానికి ఈనెల 20వ తేదీ నుంచి అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ ఫీజు చెల్లించడానికి 28వ తేదీ వరకు గడువు ఉంది. జూన్ రెండో తేదీ ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు గణితం, మధ్యాహ్నం 2గంటల నుంచి 3.30 వరకు ఫిజిక్స్ 3.45 నుంచి 5.15 వరకు కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో పరీక్షను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో నిర్వహించనున్నారు. ఈపరీక్షలో సాధించిన మెరిట్ ప్రకారం డిప్లొమా ఇంజినీరింగ్ రెండో ఏడాదిలోకి ఐటీఐ అభ్యర్థులకు ప్రవేశం కల్పించనున్నారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 138.00 |
| లైవ్ ధర | 158.00 |
| విత్ స్కిన్ | 286.00 |
| స్కిన్ లెస్ | 296.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 550 |
| విజయనగరం | 554 |
| శ్రీకాకుళం | 554 |

## ఆకట్టుకుంటున్న రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు


బంధం నాటికలో ఓ సన్నివేశం

అనకాపల్లి టౌన్, మే 18: స్థానిక వీవీ రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పరిషత్ నిర్వాహకుడు వీసీహెచ్. నాయుడు, కేఎం నాయుడుల పర్యవేక్షణలో శనివారం జరిగిన విజయవాడ మైత్రీ కళానిలయం కళాకారులు ప్రదర్శించిన 'బంధం', నెల్లూరు ప్రియదర్శిని బృందం కళాకారులు ప్రదర్శించిన 'నాన్న బంగారు' నాటికలు అద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

**బంధాలు గుర్తు చేసిన 'బంధం'**

మనిషి జీవితం 'బంధం'తో మొదలవుతుంది. తల్లిదండ్రులు, తోడబుట్టినవాళ్ళు, మిత్రులు, గురువులు, పెళ్ళేయ్యాక పెళ్లాం, బిడ్డలు.. ఇలా ఎన్నో బంధాలు. కానీ కడ దాకా కలిసి ప్రయాణం చేసే భార్యాభర్తల బంధం ఎంతో పటిష్ఠమైనది.. విడదీయరానిది. అందునా వృద్ధాప్యంలో ఈ బంధం మరింత బలపడి ఒకరి కోసం ఒకరిగా మిగిలిపోతారు. కన్నవారు రెక్కలొచ్చి ఎగిరిపోతే మిగిలేది ఆ ఇద్దరే.. వృద్ధాప్యం మనిషికి రెండో బాల్యం. పసితనంలోనే అలకలు, మంకుపట్టు, ప్రేమలు, ఇవన్నీ పునరావృతమవుతాయి. కొట్టినా అమ్మని వదలక కౌగిలించుకునే పసివాడులా, దంపతుల మధ్య తగవులు, కీచులాటలు తాత్కాలికం. క్షణంలో మళ్ళీ కలుస్తారు. కొత్తదనాన్ని తన వెర్రి ఆలోచనలతో కోరుకున్న సుబ్బారాయుడు లోకం హర్షించని రీతిలో భార్యను దూరం పెడతాడు. స్నేహితుడు నారాయణ హితోక్తులు వినడు. తానొక కొత్త గేమ్ మొదలెట్టాననుకొంటాడు. కాని ఆ గేమ్‌ను తలకిందులు చేస్తూ ఆ పై వాడు మరో గేమ్ ఆడి అతడ్ని మనస్తాపానికి గురి చేస్తాడు. తట్టుకోలేని సుబ్బారాయుడు విలపిస్తాడు. ఊహించని మరో మలుపుతో కళ్లు తెరిచి తన తప్పును దిద్దుకుంటాడు.

**ఆకట్టుకున్న 'నాన్న బంగారు'**

ఎదురుగా ఉన్న బిడ్డను ముద్దు పెట్టుకున్నప్పుడు కలిగే అనుభూతి, ఆ బిడ్డ ఫొటోను ముద్దు పెట్టుకున్నప్పుడు కలుగదు. ఎందుకంటే మొదటి దానిలో జీవం ఉంటే, రెండవ దానిలో దాని ప్రతిబింబం ఉంటుంది. అలాగే వీడియో కాల్‌లో మనిషికి, మనిషికి మధ్య స్ర్కీన్ అడ్డం ఉంటుంది. వీడియో కాల్ బిడ్డ ఫొటోను ముద్దు పెట్టుకోవడం లాంటిది. ఇల్లు స్వీట్ హోమ్ కావాలంటే కుటుంబ సభ్యులందరూ ఫిజికల్‌గా దగ్గరగా ఉండాలి.. టచ్ ఉండాలి. స్వచ్ఛమైన ప్రేమ, అభిమానాలు ఉండాలి. అది సంపద.. ఆ సంపదను ఇప్పుడు కొందరు తండ్రులు. బిడ్డలకు 60 ఏళ్ళు వచ్చినా వాడికేం తెలీదు. పసివాడు అన్న మాయలో వాడి జీవితాన్ని ఉద్ధరిస్తున్నాం అనుకుంటారే కానీ, బిడ్డ మనసును గాయపరుస్తున్నాం అని గ్రహించరు. మేం ఎక్కడికి వెళ్లం మీ దగ్గరే ఉంటాం అని కొడుకులు ప్రాధేయపడుతూ ఉన్నా, పక్కింటి సుబ్బారావు కొడుకు అమెరికా, ఎదురింటి పంకజం అల్లుడు ఆస్ట్రేలియా, నువ్వు ఇక్కడ ఉంటే మా తల కొట్టేసినట్టుగా ఉంటుంది. నువ్వు వెళ్లి తీరాలి అని కొడుకుల్ని బలవంతంగా దూరం చేసుకుంటున్నారు కానీ జీవితం చాలా చిన్నది.. అందులో ప్రతీ క్షణాన్ని అనుభవించాలి.. ఆస్వాదించాలి. గడిచిపోయిన క్షణం తిరిగి రాదు.. మిస్ అయింది మళ్లీ దొరకదు. ఆఖరి దశలో మనిషికి ఓదార్పు, ఊరట ఇచ్చేది కన్నబిడ్డల సాన్నిత్యం, ఆత్మీయ స్పర్శ అందులో ఉండే భరోసా ఆనందం, అమెరికా డాలర్‌లో లేదని చేతులు కాలాక గ్రహిస్తారు. మనిషికి కావలసిన సంపద ఏంటీ అని తెలియజేసేది నాన్న బంగారు నాటిక.

# కీలకంగా పోస్టల్ ఓట్లు

**ఈ పర్యాయం పోలైన ఓట్లు 22,763**

- ఉద్యోగులు 15,450
- అత్యవసర సేవల ఉద్యోగులు 830
- ఇంటి వద్ద నుంచి ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు 1,478 మంది
- మొత్తం ఓటర్లలో 1.13 శాతం
- 2019లో పోస్టల్ బ్యాలెట్లు 6,651 ఓట్లు

**2019లో పోస్టల్ బ్యాలెట్లు**

విశాఖ పార్లమెంటు నియోజకవర్గం
మొత్తం పోస్టల్ బ్యాలెట్‌లు: 6,708

| పార్టీ | ఓట్లు | శాతం |
|---|---|---|
| టీడీపీ | 1,399 | 20.79 |
| వైసీపీ | 2,938 | 43.66 |
| జనసేన | 1,802 | 26.78 |
| కాంగ్రెస్ | 83 | 1.23 |
| బీజేపీ | 462 | 6.86 |

1. భీమిలి నియోజకవర్గం
పోస్టల్ బ్యాలెట్‌లు: 1,696

| | | |
|---|---|---|
| టీడీపీ | 319 | 18.8 |
| వైసీపీ | 1,089 | 64.2 |
| జనసేన | 134 | 7.9 |
| కాంగ్రెస్ | 20 | 1.17 |
| బీజేపీ | 119 | 7.01 |

2. తూర్పు నియోజకవర్గం
పోస్టల్ బ్యాలెట్‌లు :1,063

| | | |
|---|---|---|
| టీడీపీ | 321 | 30.19 |
| వైసీపీ | 643 | 60.48 |
| జనసేన | 67 | 6.3 |
| కాంగ్రెస్ | 2 | 0.18 |
| బీజేపీ | 24 | 2.25 |

3. దక్షిణ నియోజకవర్గం
పోస్టల్ బ్యాలెట్‌లు: 503

| | | |
|---|---|---|
| టీడీపీ | 146 | 29.02 |
| వైసీపీ | 310 | 61.63 |
| జనసేన | 32 | 6.36 |
| కాంగ్రెస్ | 3 | 0.59 |
| బీజేపీ | 8 | 1.59 |

4. ఉత్తర నియోజకవర్గం
పోస్టల్ బ్యాలెట్‌లు: 776

| | | |
|---|---|---|
| టీడీపీ | 192 | 24.74 |
| వైసీపీ | 445 | 57.34 |
| జనసేన | 54 | 6.95 |
| కాంగ్రెస్ | 3 | 0.38 |
| బీజేపీ | 70 | 9.08 |

5. విశాఖ పశ్చిమ
పోస్టల్ బ్యాలెట్‌లు: 706

| | | |
|---|---|---|
| టీడీపీ | 309 | 43.76 |
| వైసీపీ | 331 | 46.88 |
| సీపీఐ | 31 | 4.39 |
| కాంగ్రెస్ | 4 | 0.56 |
| బీజేపీ | 23 | 3.25 |

6. గాజువాక
పోస్టల్ బ్యాలెట్‌లు 1,030

| | | |
|---|---|---|
| టీడీపీ | 189 | 18.34 |
| వైసీపీ | 523 | 50.77 |
| జనసేన | 256 | 24.85 |
| కాంగ్రెస్ | 9 | 0.87 |
| బీజేపీ | 52 | 5.04 |

7. పెందుర్తి
పోస్టల్ బ్యాలెట్‌లు 877

| | | |
|---|---|---|
| టీడీపీ | 204 | 23.26 |
| వైసీపీ | 588 | 67.04 |
| జనసేన | 61 | 6.95 |
| కాంగ్రెస్ | 5 | 0.57 |
| బీజేపీ | 18 | 2.05 |

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఈసారి పోస్టల్ బ్యాలెట్లు కీలకం కానున్నాయి. జిల్లాలో ఉద్యోగులు అధికశాతం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారు. ఇంటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే విధానానికి ఈ దఫా ఎన్నికల సంఘం స్వస్తి పలికింది. జిల్లా కేంద్రాలు, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా జిల్లాలోని ఏడు సెగ్మెంట్‌లలో ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలెట్‌లలో 6,651 ఓట్లు చెల్లాయి. అప్పుడు 18,81,678 మంది ఓటర్లు ఉండగా...పోస్టల్ బ్యాలెట్ ఓట్లు శాతం కేవలం 0.31. అయితే ఈ పర్యాయం జిల్లాలో 20,12,376 మంది ఓటర్లు ఉండగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకున్నవారి సంఖ్య 22,763. అంటే 1.13 శాతం. వీరిలో జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు 15,450 మంది, అత్యవసర సేవల ఉద్యోగులు 803 మంది, ఇంటి నుంచి ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు 1,478 మంది ఉన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సరాసరి వెయ్యికి పైగా ఓట్లు పోలయ్యాయి. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులు ఓటేశారు. ఈ పర్యాయం వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశామని ఉద్యోగులు బహిరంగంగానే చెబుతున్నారు. అత్యధికంగా నమోదైన ఉద్యోగుల ఓట్లు ఈసారి కొన్ని నియోజకవర్గాల్లో ఫలితాలను తారుమారు చేసే అవకాశం లేకపోలేదంటున్నారు.

ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో కీలకం. కొన్నిసార్లు ఒక్క ఓటే ఫలితాన్ని తారుమారు చేస్తోంది. 1989లో కొణతాల రామకృష్ణ అనకాపల్లి నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి సమీప ప్రత్యర్థి పెతకంశెట్టి అప్పలనరసింహంపై కేవలం తొమ్మిది ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ కేవలం 26 ఓట్ల తేడాతో విజయవాడ సెంట్రల్ సీటును కోల్పోయింది.

**2024లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్లు**

| నియోజకవర్గం | ఉద్యోగులు | వృద్ధులు, దివ్యాంగులు | అత్యవసర సేవలసిబ్బంది |
|---|---|---|---|
| భీమిలి | 2,366 | 494 | 585 |
| విశాఖ తూర్పు | 2,716 | 184 | 18 |
| విశాఖ దక్షిణ | 1,429 | 136 | 6 |
| విశాఖ ఉత్తరం | 2,307 | 242 | 57 |
| విశాఖ పశ్చిమ | 1,421 | 159 | 51 |
| గాజువాక | 2,401 | 147 | 19 |
| పెందుర్తి | 2,810 | 116 | 94 |
| మొత్తం | 15,450 | 1,478 | 830 |

## విదేశీ ఉద్యోగాల పేరిట మోసం

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): 'ఒక మాదిరిగా చదువుకున్నా పర్వాలేదు. విదేశాల్లో పెద్ద ఉద్యోగం. రూ.లక్షల్లో సంపాదన. ఏసీ రూముల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ పనిచేయాల్సి ఉంటుంది' అని చెప్పి నిరుద్యోగ యువతను నమ్మించి విదేశీ ముఠాలకు విక్రయిస్తున్న ముగ్గురు సభ్యులను నగర పోలీసులు అరెస్టు చేశారు. ఆ ముఠా చేతిలో చిక్కిన ఓ యువకుడు ఇటీవల బయటపడ్డాడు. అతను ఇచ్చిన సమాచారంతో నిందితులను నగర పోలీసులు అరెస్టు చేయగలిగారు. ఇందుకు సంబంధించి శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్‌అయ్యన్నార్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

విశాఖలోని గాజువాక ప్రాంతానికి చెందిన చుక్కా రాజేష్ (33) ఇంజనీరింగ్ చదువుకున్నాడు. 2013 నుంచి 2019 వరకూ గల్ఫ్‌లో ఫైర్ సేఫ్టీ మేనేజర్‌గా పనిచేశాడు. తర్వాత గాజువాకలోనే ఒక కన్సల్టెన్సీని ప్రారంభించి గల్ఫ్ దేశాలకు ఫైర్ సేఫ్టీలో పనిచేసేందుకు మనుషులను పంపించడం మొదలెట్టాడు. 2023 మార్చిలో సంతోష్ అనే వ్యక్తి రాజేష్‌కు ఫోన్ చేసి తాను కాంబోడియా నుంచి మాట్లాడుతున్నానని, తనకు డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేసేందుకు కంప్యూటర్ నాలెడ్జ్‌తోపాటు ఇంగ్లీష్ మాట్లాడగలిగే 30 మంది కావాలని కోరాడు. విమానం టికెట్లు, వీసా, కాంబోడియాలో వసతి సదుపాయం వంటివి తానే చూసుకుంటానని, ఒక్కొక్కరి నుంచి రూ.90 వేలు వసూలుచేసి అందులో రూ.20 వేలు కమీషన్ కింద తీసుకోవాలని ఆఫర్ ఇచ్చాడు. కాంబోడియా నుంచి జాబ్ స్కామ్‌లు, టాస్క్‌గేమ్ వంటి సైబర్ ఫ్రాడ్స్ చేసే పని వారికి అప్పగిస్తామని రాజేష్‌కు చెప్పాడు. అయితే తక్కువ కాలంలోనే భారీగా సంపాదించే అవకాశం దొరికిందని భావించిన రాజేష్ విశాఖతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతను కాంబోడియాలో ఉద్యోగాలంటూ ఆకర్షించి తొలుత 27 మందిని మూడు దఫాలుగా అక్కడకు పంపించాడు. తర్వాత ఆర్య అనే మహిళ రాజేష్‌ను పరిచయం చేసుకుని సంతోష్ కంటే ఎక్కువ కమీషన్ ఇస్తామని చెప్పింది. ఆమెతోపాటు ఉమామహేష్, హబీబ్ అనే ఏజెంట్లు కూడా పరిచయం అయ్యారు. వీరందరి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా తనను సంప్రతించిన 150 మంది నిరుద్యోగులను రాజేష్ విజిటింగ్ వీసాపై బ్యాంకాక్..అక్కడ నుంచి కాంబోడియా పంపించాడు. అక్కడకు వెళ్లిన తర్వాత ఒక్కొక్కరిని చైనా కంపెనీలకు ఏజెంట్లు 2,500 డాలర్లు నుంచి నాలుగు వేల డాలర్లు చొప్పున విక్రయించారు. ఇలా గత రెండేళ్లలో ఏపీ, తెలంగాణాతోపాటు దేశవ్యాప్తంగా ఐదు వేల మంది పలువురు ఏజెంట్ల ద్వారా కాంబోడియా చేరినట్టు పోలీసులు అంచనా వేస్తున్నారు. వీరందరినీ చైనా ముఠాలు కొనుక్కొని వారికి సైబర్ నేరాలపై శిక్షణ ఇచ్చి భారతీయులకు ఫోన్‌లు చేయించి మోసాలకు పాల్పడేలా చేస్తున్నాయి. ఎవరైనా ఆ పని చేయబోమంటే చీకటి గదుల్లో పెట్టి చిత్రహింసలకు గురిచేసేవి. ఇలా ఈ ఏడాదిన్నరలో భారతీయుల నుంచి వందల కోట్లు దోచుకున్నాయి. కాగా, కాంబోడియాలో చైనా ముఠా చేతిలో చిక్కుకున్న నగరానికి చెందిన బొత్స శంకర్ అక్కడి నుంచి తప్పించుకుని నగరానికి చేరుకుని 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం అందజేశారు. దీనిపై సీపీ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాల మేరకు సైబర్‌క్రైమ్ సీఐ కె.భవానీప్రసాద్ లోతుగా దర్యాప్తు చేసి ఉద్యోగాల పేరుతో మానవ అక్రమ రవాణాకు సహకరిస్తున్న గాజువాక ప్రాంతానికి చెందిన చుక్కా రాజేష్‌తోపాటు అతని వద్ద పనిచేస్తున్న సబ్బవరపు కొండలరావు, మన్నేన జ్ఞానేశ్వర్‌లను అరెస్టు చేశారు. కాంబోడియాలో చిక్కుకున్న వారిని విడిపించేందుకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిత్వశాఖతో సంప్రతింపులు జరుపుతామని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఏడీసీపీ ఎం.శ్రీనివాసరావు, సైబర్ క్రైమ్ సీఐ భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్



తాళ్లపాలెంలో ఆర్డీ ఫోర్స్ ర్యాలీ చేస్తున్న దృశ్యం

**కశింకోట, మే 18:** గ్రామాల్లో స్వేచ్ఛాయుత వాతావరణానికి, ఎన్నికల కౌంటింగ్‌కు ప్రజలంతా సహకరించాలని కోరుతూ శనివారం పలు గ్రామాల్లో పోలీసులు, కేంద్ర బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. సీఐ వినోద్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కేంద్ర పోలీసు బలగాలు, పోలీసు సిబ్బంది కశింకోట, తాళ్లపాలెం, పరవాడపాలెం, కన్నూరుపాలెం, జోగారావుపేట గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌బాబు, 60 మంది జార్ఖండ్ ఆర్మీ ఫోర్స్ పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

**పాయకరావుపేట రూరల్, మే 18 :** మండలంలోని శ్రీరాంపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. 11 కేవీ శ్రీరాంపురం అగ్రికల్చరల్ ఫీడర్ పరిధిలో కొమ్మలు నరుకుట తదితర పనుల నిమిత్తం సోమవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శ్రీరాంపురం, రాజవరం, కేశవరం, ఎస్.నర్సాపురం, గజపతినగరం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## 'పెదకలవలాపల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి'


శిబిరాన్ని సందర్శించిన సీపీఎం మండల కన్వీనర్ దేముడునాయుడు

**రాంబిల్లి, మే 18:** మండలంలోని పెదకలవలాపల్లి గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ చుట్టూ డీఆర్‌డీవో నిర్మిస్తున్న ప్రహరీ గోడ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. పెదకలవలాపల్లిలో రైతులు చేస్తున్న నిరసన శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు 207 రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గ్రామంలోని రైతులు పనులు చేసుకొనేందుకు, పశువులను మేపుకొనేందుకు ఈ కొండే ఆధారమన్నారు. ప్రహరీ నిర్మాణంతో రైతులు తమ పొలాలకు వెళ్లడానికి, పశువులను మేపుకోవడానికి అడ్డంకిగా మారిందన్నారు. కొత్త ప్రభుత్వమైనా గ్రామ రైతుల బాధలను తీర్చాలని దేమునాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు రావి దేముళ్లు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ శివాజీ, మహిళా రైతులు పాల్గొన్నారు.

## కొరుప్రోలు జూనియర్ కళాశాలలో సీట్ల భర్తీ ప్రక్రియ ప్రారంభం

▸ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ

**ఎస్.రాయవరం, మే 18:** మండలంలోని కొరుప్రోలు జడ్పీ హైస్కూల్‌ను జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసినట్టు హైస్కూల్ హెచ్ఎం, ప్రిన్సిపాల్ సకురు సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. హైస్కూల్ అప్‌గ్రేడ్ చేయడంతో జూనియర్ కళాశాలలో సీట్ల భర్తీ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. తొలుత ఎంపీసీ, బైపీసీ కోర్సులు ప్రవేశపెడుతున్నారని, ఒక్కొక్క కోర్సులో 40 మంది విద్యార్థులు చేరవచ్చునన్నారు. జూనియర్ కళాశాల మంజూరుపై ఇప్పటికే గ్రామాల్లో ప్రచారం చేశామన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి కళాశాలలో తరగతులు ప్రారంభం కానున్నాయని, ప్రభుత్వం అధ్యాపకుల నియామకం చేపడుతుందన్నారు. ఈనెల మొదటి వారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఇప్పటికే నలభై సీట్లకు సంబంధించి విద్యార్థులు దరఖాస్తు చేశారని, మిగిలిన సీట్లకు సంబంధించి ఆసక్తి గల విద్యార్థులు తనను సంప్రదించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు.

## 'పది'కి కొత్త సిలబస్

... 5వ పేజీ తరువాయి

ఇంగ్లీషు వాచకం, ఉపవాచకంతో పాటు వర్క్ పుస్తకాలు ఉన్నాయి. సాధారణంగా పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తుంటే విద్యార్థి శ్రద్ధగా విని, ఆకళింపు చేసుకుని ఆ తరువాత వాటిని క్షుణ్ణంగా చదువుతుంటారు. అయితే కొత్త సిలబస్‌లో విద్యార్థులు స్వయంగా ప్రయోగం చేసి, తనలోని నైపుణ్యాన్ని మెరుగుపరచుకునేలా తీర్చిదిద్దారని ఎంఈవో-2 నాగేంద్ర తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు ఈ సిలబస్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

## టీఎస్ ఎంసెట్‌లో విశాఖ విద్యార్థుల జోరు

... 5వ పేజీ తరువాయి

తోట ధీరజ్వేర్ (184), కట్టమూరి కుశాల్ (190వ ర్యాంకు) సాధించారు. అగ్రికల్చర్ ఫార్మసీ విభాగాల్లో శరగడం పావని 32వ ర్యాంకు, మేకా గాయత్రి 44వ ర్యాంకు, శంబంగి మనో అభిరామ్ 73, జె.సాకేత్‌సాయి 113, సీహెచ్ వేదాంత సంతోష్ 123, టి.సాయి నిఖిలేష్ 149, బి.జయదీప్ 169వ ర్యాంకు సాధించారు. తెలంగాణ ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను శ్రీచైతన్య ఏజీఎం కేవీ రమణ అభినందించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్/ఫార్మసీ విభాగాల్లో 10లోపు ఒకరు, 100లోపు ఏడుగురు, 500లోపు 59 మంది ర్యాంకులు సాధించారన్నారు. ఇందుకు కృషిచేసిన కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని ఆయన అభినందించారు.



# వరహా నదికి పొంచి ఉన్న చెత్త ముప్పు

▸ ఏటికొప్పాక, దార్లపూడి గ్రామాల చెత్త నదిలో డంపింగ్
▸ ఇళ్ల వ్యర్థాలు కూడా..
▸ కలుషితమవుతున్న నీరు
▸ పట్టించుకోని పంచాయతీ అధికారులు


వరహానదికి ఎడమ పక్కన దార్లపూడి గ్రామం వైపు డింపింగ్ చేస్తున్న చెత్త

**ఎలమంచిలి, మే 18:** వరహా నదికి చెత్త ముప్పు పొంచి ఉంది. నదిలో రెండు గ్రామాలకు చెందిన చెత్తను డంపింగ్ చేస్తుండడంతో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. నదిలో రెండు వైపులా కొండను తలపించేలా చెత్త పేరుకుపోయి దర్శనమిస్తున్నది. ఈ చెత్త కొండలను చూసి పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరహానదికి కుడి వైపు ఏటికొప్పాక గ్రామం ఉండగా.. మరో వైపు దార్లపూడి గ్రామం ఉంది. ఏటికొప్పాక గ్రామం ఎలమంచిలి మండలం కాగా.. దార్లపూడి గ్రామం ఎస్.రాయవరం మండలంలో ఉన్నాయి. ఈ రెండు గ్రామాలకు చెందిన చెత్తను వరహా నదికి రెండు వైపులా వేస్తుండడంతో గర్భం నిండిపోతోంది. గ్రామంలో చెత్త చెదారంతో పాటు ఇళ్ల వ్యర్థాలను కూడా పడేస్తున్నారు. దీంతో నదీగర్భంలో నీటి వనరులు రాను రాను దెబ్బతినే అవకాశం లేకపోలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నది పరివాహక ప్రాంతమంతా చెత్త డంపింగ్‌తో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రోడ్డు మార్గాల్లో రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులుకు గురవుతున్నారు. వరహానది ప్రాంతాన్ని సుందరంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలతో పాటు అధికారులపైన ఉందని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. కానీ ఈ రెండు గ్రామాలకు చెందిన పంచాయతీ అధికారులు మనకెందుకులే అన్న చందంగా వ్యవహరిస్తుండడంతో వరహా నది చెత్త డంపింగ్ యార్డుగా మారిపోతుంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకుంటే రానున్న రోజుల్లో వరహా నదికి చెత్త ముప్పు తప్పేట్టు లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రెండు గ్రామాల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి వరహా నదిని చెత్త ముప్పు నుంచి కాపాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.


వరహానదికి కుడి పక్కన ఏటికొప్పాక గ్రామం వైపు డింపింగ్ చేస్తున్న చెత్త

## కూటమి శ్రేణులతో పంచకర్ల సమావేశం

▸ పోలింగ్ సరళిపై చర్చ.. ▸ విజయంపై ధీమా..

**పరవాడ, మే 18 :** జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు శనివారం పరవాడ మరిడిమాంబ కల్యాణ మండపంలో జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. జూన్ నాల్గో తేదీన వెలువడే ఎన్నికల ఫలితాల్లో పెందుర్తి నుంచి జనసేన అభ్యర్థిగా తాను విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తామన్నారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా ఓటింగ్ సరళి గురించి చర్చించారు. ఏ పంచాయతీలో ఎంత మెజారిటీ వస్తుందో అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, అనకాపల్లి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరి వెంకటరమణ, 77, 79వ వార్డుల టీడీపీ అధ్యక్షులు మచ్చ శివకుమార్, పాల అచ్చిలనాయుడు, టీడీపీ మండల టీడీపీ వియ్యపు చిన్న, గండి వంశీ, దుల్లా రామునాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, మోటూరి సన్యాసినాయుడు, బుగిడి రామగోవిందరావు, కూండ్రపు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

# కన్నుల పండువగా వాసవీమాత జన్మదిన వేడుక

**అనకాపల్లి టౌన్, మే 18:** స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు శనివారం కన్నుల పండువగా జరిగాయి. తెల్లవారుజామున అమ్మవారి పల్లకి ఊరేగింపు సేవ, నిత్యప్రార్థనలు, ఏడున్నర గంటలకు గోపూజ, నగరేశ్వరస్వామి, జనార్దనస్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తొమ్మిది గంటలకు భక్తులచే ఆలయ ముఖ మండపంలో ధాన్యాభిషేకం చేసి పది గంటలకు అమ్మవారి మూలవిరాట్‌కు లక్ష మల్లెలతో అర్చనా కార్యక్రమాలు జరిగాయి. పదకొండున్నర గంటలకు పేద మహిళలకు చీరలు పంపిణీ, అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు 102 రకాల మిఠాయిలతో అమ్మవారికి నివేదన, ఆరున్నర గంటలకు ఊంజలసేవ కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు తెలిపారు.

**పాయకరావుపేటలో..** ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీమాత జయంతి వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. శనివారం స్థానిక చిత్రమందిర్ సెంటర్‌లో వాసవీ క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వాసవీమాత చిత్రపటానికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కట్టమూరి సూకరాజు, క్లబ్ అధ్యక్షులు రాయపూడి జయప్రకాష్, ఏల్చూరి విజయ, కార్యదర్శులు వి.సత్యనారాయణ, ఎ.పావని, కోశాధికారులు కె.నాని, ఎ.సుబ్బలక్ష్మి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

**సబ్బవరంలో..** మండల కేంద్రంలో వాసవీమాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్యులు, పలువురు భక్తులు వాసవీమాత చిత్రపటానికి పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు.

**ఎలమంచిలిలో..** పట్టణంలోని దిమిలి రోడ్డు జంక్షన్ సమీపంలో ఉన్న వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో శనివారం 51వ వార్షికోత్సవాలను ప్రారంభించారు. శనివారం నుంచి ఐదు రోజులు పాటు ఈ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం జన్మదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్సవాల్లో భాగంగా 108 కలశములతో నగర సంకీర్తన నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి, అన్నసమారాధన నిర్వహించారు. ఐదు రోజులు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్నిరకాల ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.


అమ్మవారికి ధాన్యాభిషేకం చేస్తున్న భక్తులు

## గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు

**పాయకరావుపేట, మే 18 :** పట్టణంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులకు విశేష స్పందన లభిస్తోంది. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈనెల 15 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం నీతి కథలు, పుస్తక పఠనం, ఇంగ్లీషు స్పీకింగ్ కోర్సు, మ్యాథ్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం వివిధ ఆటలు నిర్వహించి మెలకువలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందించడం, క్రీడా నైపుణ్యాన్ని మరింత మెరుగుపర్చడం కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**చినదొడ్డిగల్లులో..**

**నక్కపల్లి:** మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం నుంచి స్పోకెన్ ఇంగ్లీష్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో రిసోర్స్‌పర్సన్ దాడి స్వరూప్ పిల్లలకు ఇంగ్లీషులో చదవడం, అర్థం చేసుకోవడంపై మెలకువలను నేర్పుతున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జనార్దన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్లంలో మాట్లాడడం, పుస్తకపఠనం ఎంతో అవసరమని, భాషా పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.


శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

## ఖరీఫ్‌కు సాగు ప్రణాళిక!

... 5వ పేజీ తరువాయి

వివిధ రకాల విత్తనాలు అవసరమని లెక్కలు కట్టారు. వరి 22,376 క్వింటాళ్లు, వేరుశనగ 140 క్వింటాళ్లు, నువ్వులు 11 క్వింటాళ్లు, చిరుధాన్యాలు, అపరాలు 96 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉంచి, సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

**ఎరువుల ప్రణాళిక ఇదీ...**

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అన్ని రకాల రసాయన ఎరువులు కలిపి 35,353 మెట్రిక్ టన్నులు అవసర మని గుర్తించి ఇండెంట్ పెట్టారు. పూర్తిస్థాయి ఎరువులు ఆర్‌బీకేల్లో నిల్వ ఉంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాకు సరఫరా అయిన ఎరువులను కోటా మేరకు ప్రైవేటు వ్యాపారులకు కేటాయించి, రైతు భరోసా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా రైతులకు పంపిణీ చేయనున్నారు. దీంతో పాటు ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పెంపొందించేందుకు వీలుగా 1,056 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచనున్నారు. వ్యవసాయ ప్రణాళికపై జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు వద్ద ప్రస్తావించగా ఖరీఫ్ సాగుకు వాతావరణం అనుకూలించే అవకాశాలు కనిపిస్తున్నాయని, రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ప్రతిపాదనలు పంపామన్నారు.

# మామిడిపై రసాయనాలు

... 5వ పేజీ తరువాయి

అనే గ్యాస్‌ను సాధారణంగా వెల్డింగ్‌కు వినియోగిస్తుంటారు. దీనిని పండ్లను మగ్గబెట్టేందుకు వినియోగిస్తున్నారు. అలా పండించిన పండ్లను తీసుకుంటే ప్రమాదకరమైన కేన్సర్లు బారినపడే అవకాశముంది.

**తీవ్రమైన ఆరోగ్య సమస్యలు**

రసాయనాలు కలిపిన పండ్లను తీసుకోవడం వల్ల తీవ్ర మైన అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశ ముందని వైద్యులు చెబుతున్నారు.ఈ పండ్లను తీసుకున్న వెంటనే జీర్ణ సంబంధ సమస్యలు కనిపిస్తే, దీర్ఘకాలంలో ప్రమాదకర వ్యాధులకు కారణమయ్యే అవకాశముందని చెబుతున్నారు. కృత్రిమం గా ఎసిటిలిన్ గ్యాస్ వినియోగించి మగ్గబెట్టిన పండ్లను తీసుకుంటే కేన్సర్ బారిన పడే అవకాశముంది. రసాయనాలు కలిగిన పండ్లను తినడం వల్ల తలనొప్పి, మైకం, మానసిక గందరగోళం, జ్ఞాపకశక్తి నశించడం, మానసిక స్థితి నిలకడగా లేకపోవడం, నిద్రలేమి, సెరిబ్రల్ ఎడిమా వంటి సమస్యలు ఇబ్బందులకు గురిచేస్తాయని చెబుతున్నారు. వీటితోపాటు మూర్ఛ బారినపడి దీర్ఘకాలంలో హైపోక్సియాను ప్రేరేపిస్తూ శరీర వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపించే అవకాశం ఉంది.

**ఇలా గుర్తించాలి**

రంగు, రుచి, గుజ్జు, రసం ద్వారా రసాయనాలు కలిపిన పండ్లను గుర్తించవచ్చు. రసాయనాలు చల్లిన పండ్లు సాధారణంగా ముగ్గిన వాటి మాదిరిగా కాకుండా అసహజ ముదురు రంగును కలిగి ఉంటాయి. రుచి తేడాగా ఉంటుంది. చప్పగా ఉంటుంది. కాల్షియం కార్బైడ్ కలిపిన పండ్లను తీసుకున్న ప్పుడు నోటిలో మంటగా ఉంటుంది. వీటిని తిన్న తరువాత కడుపునొప్పి, డయేరియా, గొంతులో మంట ఉంటాయి. సహజంగా పండిన ఫలాలతో పోలిస్తే రసాయనాలు కలిపిన పండ్లలో తగినంత రసం ఉండదు.

**స్పెషల్ డ్రైవ్**

ఈ నెల 20 నుంచి మామిడి పండ్ల విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు ఆహార, భద్రతా ప్రమాణాల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తనిఖీలు నిర్వహిస్తున్నారు. పది వరకు నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నమూనాలు సేకరించి తనిఖీలు నిర్వహించనున్నట్టు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ జిల్లా అధికారి నందాజీ తెలిపారు. 100 పీపీఎం కంటే ఎక్కువ ఉన్నట్టు తేలితే వ్యాపారులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇథలిన్ 100 పీపీఎం దాటితే జరిమానాతోపాటు రెండేళ్లపాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. కాల్షియం కార్బైడ్ వినియోగించినట్టు తేలితే ఆరు నెలలు జైలుతోపాటు రెండు లక్షల రూపాయల వరకు జరిమానా ఉంటుందన్నారు.


తిరుమలలో సీఎం రమేశ్, ఆయన కుటుంబ సభ్యులు

## వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం రమేశ్

**కొత్తూరు, మే 18 :** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వరస్వామిని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరిపై స్వామి ఆశీస్సులు ఉండాలని, జిల్లా ప్రజలకు సేవ చేసే శక్తిని, అదృష్టాన్ని ప్రసాదించాలని వేడుకున్నట్టు సోషల్ మీడియాలో సీఎం రమేశ్ పేర్కొన్నారు.

## రిటైర్డు హోంగార్డుకు ఆర్థిక సాయం


రామలింగానికి చెక్కును అందిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

**అనకాపల్లి రూరల్, మే 18 :** హోంగార్డుగా విధులు నిర్వహించి, పదవీవిరమణ చేసిన ఎం.రామలింగానికి సహచర హోంగార్డులంతా ఆర్థిక సాయం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులంతా తమ ఒకరోజు వేతనం రూ. మూడు లక్షల 86వేల 240 చెక్కును జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ శనివారం రామలింగానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ రామలింగం పోలీస్ శాఖకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. శేష జీవితాన్ని కుటుంబంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్,ఏవో శారదా పాల్గొన్నారు.

## పండుగలకు ఆర్‌వో అనుమతి తప్పనిసరి : సీఐ

**కశింకోట, మే 18 :** ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల గ్రామాల్లో పండుగలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ వినోద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి చోటా 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలులో ఉందన్నారు. గ్రామాల్లో ఎటువంటి సభలు గానీ, సమావేశాలు గానీ ఏర్పాటు చేసుకోకూడదన్నారు. గ్రామ దేవతలు పండుగల్లో గుమికూడి ఉండకూడదని, స్వచ్ఛందంగా ఆయా గ్రామ దేవత, అమ్మవార్లను ప్రజలు దర్శించుకోవచ్చనన్నారు. ఎన్నికల నిబంధనలు దృష్టిలో ఉంచుకొని ప్రజలంతా తమకు సహకరించాలని ఆయన కోరారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఆరంభం

**తుమ్మపాల, మే 18:** మండలంలోని తుమ్మపాలలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధానోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలుత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద ప్రముఖ సిద్ధాంతి ఈదలాడ సత్యానారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మత్తుర్తి మహేష్, ఆలయ సభ్యులు కోసూరి బాబూరావు, పెదపాటి వెంకటరమణ, ఎస్.వేణుగోపాల్, జి. సన్యాసిరావు, బ్రహ్మజీ, నాగేశ్వరరావు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## 'వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి'

**తుమ్మపాల, మే 18 :** వేసవి దృష్ట్యా ప్రతి ఒక్కరూ వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి నజరత్ షమీమ్ అన్నారు. శనివారం వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. తుమ్మపాల, కాపుశెట్టివానిపాలెం, రేబాక తదితర గ్రామాల్లో ఉపాధి కూలీలతో అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ద్రవ పదార్థాలను ఎక్కువ తీసుకోవాలన్నారు. అవసరం మేరకు మాత్రమే ఎండలోకి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్ఐ

**మునగపాక (తుమ్మపాల), మే 18 :** ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.ప్రసాదరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని గణపర్తి, చూచుకొండ, రామగిరి, చెర్లోపాలెం, మెలిపాక గ్రామాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత కూడా పది రోజులు వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు.

## నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ద్వాదశి వార్షిక తిరు కల్యాణ మహోత్సవం

**పాయకరావుపేట రూరల్, మే18 :** మండలంలోని మంగవరంలో ఆదివారం నుంచి వేంకటేశ్వరస్వామి ద్వాదశి వార్షిక తిరు కల్యాణం ఘనంగా జరిపించేందుకు దైవజ్ఞులు, గ్రామ భక్తులు నిర్ణయించినట్టు ఆలయ ధర్మకర్తలు తమిడిశెట్టి బసవరాజు, తమిడిశెట్టి శ్రీనివాస అయ్యారావు తెలిపారు. 19వ తేదీన ఉదయం 8 గంటల నుంచి స్వామి వారి ప్రతిష్ఠ.. విగ్రహాలకు పంచామృతాభిషేకం అనంతరం 10 గంటల నుంచి అగ్నిహోమం, 20వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి స్వామి వారి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో పల్లకీ సేవ, 23వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## కుమారపురంలో మేకలు దొంగతనం

**పాయకరావుపేట రూరల్, మే18:** మండలంలోని కుమారపురం శివారు రత్నయ్యమ్మపేటలో నాలుగు మేకపోతులు శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయని రైతు నీలాపు గోవిందరెడ్డి తెలిపారు. ఈ మేరకు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశామన్నారు.శుక్రవారం మేకపోతులు కొనడానికి కొంతమంది వ్యక్తులు వచ్చారని, ఆ రాత్రికే మేకపోతులు కనిపించలేదన్నారు. పట్టుకెళ్లిపోయిన మేకపోతుల విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని, మేక పిల్లలను కొనుగోలు చేసి వాటిని మేపుకుంటూ జీవనం సాగిస్తున్నానని గోవిందరెడ్డి అన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

▸ పరవాడ డీఎస్పీ సత్యనారాయణ


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

**ఎలమంచిలి, మే 18 :** ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13న జరిగిన పోలింగ్ తర్వాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎటువంటి ఘర్షణ వాతావరణం లేకుండా ఉండేందుకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ, జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల ప్రకారం పరవాడ పెందుర్తి, ఎలమంచిలి, రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం మండలాల్లో గల గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ రోజున జరిగిన చిన్నచిన్న మనస్పర్థలు ఉంటే ఆ రోజుతోనే మరచిపోవాలని, మరళా పునరావృతం కాకుండా చూసుకోవాలని రాజకీయ నాయకులు, ప్రజలను కోరారు. బైండోవర్ కేసులు నమోదు చేసిన వారు ఎటువంటి ఘర్షణలకు పాల్పడరాదని, వారు ఎటువంటి ఘర్షణు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానంగా బాణసంచా కాల్చరాదన్నారు. బాణసంచా తయారీ చేసేవారు ఎవరికైనా విక్రయించాలంటే ముందస్తు పోలీసుల అనుమతి పొందాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వచ్చే నెల 4న కౌంటింగ్ అయిన తరువాత కూడా గ్రామాల్లో ఎటువంటి సమావేశాలు, సభలు, ర్యాలీలు ఏర్పాటు చేయరాదన్నారు. అలా ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని డీఎస్పీ సత్యనారాయణ కోరారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్ఐ పాపినాయుడు, రూరల్ ఎస్ఐ సింహాచలం పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయి నుంచి బీజేపీ బలోపేతం కావాలి

▸ పార్టీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పిలుపు



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

**మాడుగుల, మే 18 :** క్షేత్రస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. శనివారం ఇక్కడి తోటలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి మంచి ఆదరణ పెరిగిందని, దానికి పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్ పోటీ చేయడమే కారణమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారన్నారు. అనకాపల్లి ఎంపీగా సీఎం రమేష్ గెలుపు వల్ల రానున్న రోజుల్లో పార్టీకి జిల్లాలో మంచి భవిష్యత్తు ఉంటుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై పార్టీ శ్రేణులు ప్రజలకు విస్తృతంగా వివరించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పుట్టా గంగయ్య, దంగేటి సూర్యారావు, మేడపురెడ్డి శ్రీనివాసరావు, కొండబాబు, దర్శిశెట్టి నారాయణరావు, కోసూరి అప్పారావు, కొట్యాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ ఎంసెట్‌లో విశాఖ విద్యార్థుల జోరు

... 5వ పేజీ తరువాయి

తోట ధీరజ్వేర్ (184), కట్టమూరి కుశాల్ (190వ ర్యాంకు) సాధించారు. అగ్రికల్చర్ ఫార్మశీ విభాగాల్లో శరగడం పావని 32వ ర్యాంకు, మేకా గాయత్రి 44వ ర్యాంకు, శంబంగి మనో అభిరామ్ 73, జె.సాకేత్‌సాయి 113, సీహెచ్ వేదాంత సంతోష్ 123, టి.సాయి నిఖిలేష్ 149, బి.జయదీప్ 169వ ర్యాంకు సాధించారు. తెలంగాణ ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను శ్రీచైతన్య ఏజీఎం కేవీ రమణ అభినందించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్/ఫార్మశీ విభాగాల్లో 10లోపు ఒకరు, 100లోపు ఏడుగురు, 500లోపు 59 మంది ర్యాంకులు సాధించారన్నారు. ఇందుకు కృషిచేసిన కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని ఆయన అభినందించారు.

## 'పది'కి కొత్త సిలబస్

... 5వ పేజీ తరువాయి

ఇంగ్లీషు వాచకం, ఉపవాచకంతో పాటు వర్క్ పుస్తకాలు ఉన్నాయి. సాధారణంగా పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తుంటే విద్యార్థి శ్రద్ధగా విని, ఆకళింపు చేసుకుని ఆ తరువాత వాటిని క్షుణ్ణంగా చదువుతుంటారు. అయితే కొత్త సిలబస్‌లో విద్యార్థులు స్వయంగా ప్రయోగం చేసి, తనలోని నైపుణ్యాన్ని మెరుగుపరచుకునేలా తీర్చిదిద్దారని ఎంఈవో-2 నాగేంద్ర తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు ఈ సిలబస్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

## ఖరీఫ్‌కు సాగు ప్రణాళిక!

... 5వ పేజీ తరువాయి

వివిధ రకాల విత్తనాలు అవసరమని లెక్కలు కట్టారు. వరి 22,376 క్వింటాళ్లు, వేరుశనగ 140 క్వింటాళ్లు, నువ్వులు 11 క్వింటాళ్లు, చిరుధాన్యాలు, అపరాలు 96 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉంచి, సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

**ఎరువుల ప్రణాళిక ఇదీ.....**

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అన్ని రకాల రసాయన ఎరువులు కలిపి 35,353 మెట్రిక్ టన్నులు అవసర మని గుర్తించి ఇండెంట్ పెట్టారు. పూర్తిస్థాయి ఎరువులు ఆర్‌బీకేల్లో నిల్వ ఉంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాకు సరఫరా అయిన ఎరువులను కోటా మేరకు ప్రైవేటు వ్యాపారులకు కేటాయించి, రైతు భరోసా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా రైతులకు పంపిణీ చేయనున్నారు. దీంతో పాటు ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పెంపొందించేందుకు వీలుగా 1,056 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచనున్నారు. వ్యవసాయ ప్రణాళికపై జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు వద్ద ప్రస్తావించగా ఖరీఫ్ సాగుకు వాతావరణం అనుకూలించే అవకాశాలు కనిపిస్తున్నాయని, రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ప్రతిపాదనలు పంపామన్నారు.

## మామిడిపై రసాయనాలు

... 5వ పేజీ తరువాయి

అనే గ్యాస్‌ను సాధారణంగా వెల్డింగ్‌కు వినియోగిస్తుంటారు. దీనిని పండ్లను మగ్గబెట్టేందుకు వినియోగిస్తున్నారు. అలా పండించిన పండ్లను తీసుకుంటే ప్రమాదకరమైన కేన్సర్లు బారినపడే అవకాశముంది.

**తీవ్రమైన ఆరోగ్య సమస్యలు**

రసాయనాలు కలిపిన పండ్లను తీసుకోవడం వల్ల తీవ్ర మైన అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశ ముందని వైద్యులు చెబుతున్నారు. ఈ పండ్లను తీసుకున్న వెంటనే జీర్ణ సంబంధ సమస్యలు కనిపిస్తే, దీర్ఘకాలంలో ప్రమాదకర వ్యాధులకు కారణమయ్యే అవకాశముందని చెబుతున్నారు. కృత్రిమంగా ఎసిటిలిన్ గ్యాస్ వినియోగించి మగ్గబెట్టిన పండ్లను తీసుకుంటే కేన్సర్ బారినపడే అవకాశముంది. రసాయనాలు కలిగిన పండ్లను తినడం వల్ల తలనొప్పి, మైకం, మానసిక గందరగోళం, జ్ఞాపకశక్తి నశించడం, మానసిక స్థితి నిలకడగా లేకపోవడం, నిద్రలేమి, సెరిబ్రల్ ఎడిమా వంటి సమస్యలు ఇబ్బందులకు గురిచేస్తాయని చెబుతున్నారు. వీటితోపాటు మూర్ఛ బారిన పడి దీర్ఘకాలంలో హైపోక్సియాను ప్రేరేపిస్తూ శరీర వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపించే అవకాశం ఉంది.

**ఇలా గుర్తించాలి**

రంగు, రుచి, గుజ్జు, రసం ద్వారా రసాయనాలు కలిపిన పండ్లను గుర్తించవచ్చు. రసాయనాలు చల్లిన పండ్లు సాధారణంగా ముగ్గిన వాటి మాదిరిగా కాకుండా అసహజ ముదురు రంగును కలిగి ఉంటాయి. రుచి తేడాగా ఉంటుంది. చప్పగా ఉంటుంది. కాల్షియం కార్బైడ్ కలిపిన పండ్లను తీసుకున్న ప్పుడు నోటిలో మంటగా ఉంటుంది. వీటిని తిన్న తరువాత కడుపునొప్పి, డయేరియా, గొంతులో మంట ఉంటాయి. సహజంగా పండిన ఫలాలతో పోలిస్తే రసాయనాలు కలిపిన పండ్లలో తగినంత రసం ఉండదు.

**స్పెషల్ డ్రైవ్**

ఈ నెల 20 నుంచి మామిడి పండ్ల విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు ఆహార, భద్రతా ప్రమాణాల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తనిఖీలు నిర్వహిస్తున్నారు. పది వరకు నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నమూనాలు సేకరించి తనిఖీలు నిర్వహించనున్నట్టు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ జిల్లా అధికారి నందాజీ తెలిపారు. 100 పీపీఎం కంటే ఎక్కువ ఉన్నట్టు తేలితే వ్యాపారులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇథలిన్ 100 పీపీఎం దాటితే జరిమానాతోపాటు రెండేళ్లపాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. కాల్షియం కార్బైడ్ వినియోగించినట్టు తేలితే ఆరు నెలలు జైలుతోపాటు రెండు లక్షల రూపాయల వరకు జరిమానా ఉంటుందన్నారు.



# ఓపెనింగ్ సరే.. పూర్తిస్థాయి సేవలేవి..?

▸ ఏరియా ఆస్పత్రిలో రూ.8.85 కోట్లతో ఓపీ విభాగం భవన నిర్మాణం ▸ మూడు నెలల క్రితం రిబ్బన్ కట్ చేసిన ఎమ్మెల్యే గణేశ్
▸ ఫర్నీచర్ లేక నేటికీ అరకొర సేవలు ▸ అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రోగులు ▸ ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు




కార్యాలయం గదిలో ఫర్నీచర్ లేకుండా ఉన్న దృశ్యం



ఏరియా ఆస్పత్రిలో ఓపీ విభాగం కోసం నిర్మించిన భవనం

**నర్సీపట్నం, మే 18 :** ఆరంభం.. ఆర్భాటం.. తప్పితే పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఓపీ విభాగం అందుబాటులోకి రాలేదు. రూ.8.85 కోట్ల నాబార్డు నిధులతో ప్రత్యేకంగా ఓపీ విభాగం కోసం జీ ప్లస్ టు భవనాన్ని నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్, మొదటి అంతస్తులో వైద్య నిపుణుల ఓపీ చికిత్స గదులు, రెండో అంతస్తులో పరిపాలనా విభాగం ఏర్పాటు చేశారు. ఫిబ్రవరిలో ఈ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ప్రారంభించారు. పరిపాలనా విభాగానికి, వైద్యులకు అవసరమైన ఫర్నీచర్ లేకపోవడంతో ఓపీ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. యూరాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ డాక్టర్లు సోమ, గురు, శనివారాల్లో ఓపీ చూస్తున్నారు. డెర్మటాలజీ, సదరం క్యాంపులు నిర్వహిస్తున్నారు. సుఖ వ్యాధులు, జెరియార్టిక్, ఇన్సెంటర్ విభాగాలకు ఫర్నీచర్ రాలేదు. పూర్తిస్థాయిలో ఓపీ విభాగం అందుబాటులోకి వస్తే రోగులకు చాలా ఉపయోగపడుతుంది. అలాగే, పాత భవనంలోని పరిపాలనా విభాగం మొత్తం కొత్త భవనంలోకి మార్చితే సౌలభ్యంగా ఉంటుందని, పాత భవనంలోని పరిపాలనా విభాగానికి ఉపయోగిస్తున్న గదులు వైద్య సేవలకు ఉపయోగించుకో వచ్చునని పలువురు సూచిస్తున్నారు.

ఈ అంశాన్ని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిదేవి వద్ద ప్రస్తావించగా, పరిపాలనా విభాగానికి సంబంధించిన ఫర్నీచర్ రావాల్సి ఉందన్నారు. త్వరలో ఫర్నీచర్ వస్తుందని వివరించారు.

## నేడు శివకేశవ స్వామి ఆలయాల్లో కల్యాణోత్సవాలు




ఆలయాల ఆవరణలో పెళ్లిరాట వేస్తున్న చైర్మన్లు

**రావికమతం, మే 18 :** జిల్లాలో ప్రసిద్ధి చెందిన కొత్తకోట శివకేశవ స్వామి వార్ల ఆలయాల్లో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత కేశవ స్వామివారికి, రాజరాజేశ్వరి సమేత రాజలింగేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు జరగనున్నాయి. వైశాఖశుద్ధ ఏకాదశి సందర్భంగా ఒకే వేదికపై ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ఆలయాల చైర్మన్లు గుమ్ముడు దొరబాబు, పి.మల్లేశ్వరరావులు శాస్త్రోక్తంగా పెళ్లిరాటను వేశారు. ఆలయ అర్చకులు ఆర్.విజయభాస్కర్, ఎన్ఆర్ఎల్‌జీ శాస్త్రిలు తొలుత విశేష పూజలు జరిపారు. ఆదివారం కల్యాణోత్సవాలు, 23న సదస్యోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈవో ఆశా కిరణ్మయి తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

## 32 వేల పాఠ్యపుస్తకాలు చేరిక



**గొలుగొండ, మే 18 :** కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు శనివారం ఇక్కడి మండల విద్యా శాఖ కార్యాలయానికి చేరాయి. మండల వ్యాప్తంగా 54 పాఠశాలలు ఉండగా, 32 వేల పాఠ్యపుస్తకాలను జిల్లా ఉన్నతాధికారులు పంపినట్టు ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. ఆయా పాఠశాలలకు త్వరలో పంపిణీ చేస్తామన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పూర్తిస్థాయిలో పుస్తకాలు అందేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

## ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి



ముషిడిపల్లి వాసవీ మాత ఆలయంలో మహిళల పూజలు



చీడికాడ మండలం జి.కొత్తపల్లి అమ్మవారి ఆలయంలో...

**దేవరాపల్లి, మే 18 :** వాసవీ మాత జయంతి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో గల ఆలయాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ముషిడిపల్లిలోని అమ్మవారి ఆలయంలో వాసవీమాతను ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. అలాగే, దేవరాపల్లిలో ఆర్య, వైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత సామూహిక వ్రతాలు జరిపారు. కొత్తపెంట వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**చీడికాడ :** జి.కొత్తపల్లిలో గల వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. వాసవీమాత జయంతి ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనాథు అప్పారావు, దోకుపర్తి శ్రీనుతో పాటు పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

▸ వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు ▸ పలుచోట్ల సామూహిక వ్రతాలు



కె.కోటపాడులో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఏఎల్‌పురంలో స్వామివారికి పూజలు



చీడికాడ ఆలయంలో బండారు, తదితరులు

**కృష్ణాదేవిపేట, మే 18 :** గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆరాధనోత్సవాలను శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అర్చకులు వీర్రాజు ఆలయంలో పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ, కార్పెంటర్ల యూనియన్, కామాక్షి వీరబ్రహ్మేంద్రస్వామి వడ్రంగి పనివార్ల సంఘం ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**కె.కోటపాడు :** మండల కేంద్రం కె.కోటపాడులో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఇంజరుపు కృష్ణ నాగరత్నం దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**చీడికాడ:** మండల కేంద్రం చీడికాడలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాల సందర్భంగా గురువారం నుంచి మూడు రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. మాజీ మంత్రి, మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

## గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

▸ పోలీసు అధికారులు హెచ్చరిక
▸ పలుచోట్ల అవగాహన సదస్సులు



దామునాపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న చోడవరం సీఐ శ్రీనివాసరావు



రావికమతం మండలం గుమ్మళ్ళపాడులో 144వ సెక్షన్ అమలుపై కానిస్టేబుల్ ప్రచారం

**చోడవరం, మే 18:** సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రకటించేంత వరకూ గ్రామాల్లో ప్రజలు ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని స్థానిక సీఐ బి. శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయా గ్రామస్థులతో ఏర్పాటైన సమావేశాల్లో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎక్కడా ప్రజలు గుమిగూడి ఉండరాదన్నారు. చట్టాన్ని వ్యతిరేకించే విధంగా వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అందరూ ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**కె.కోటపాడు :** ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు ఎన్నికల కోడ్, 144వ సెక్షన్ అమలులో ఉంటుందని కె.కోటపాడు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నిబంధనలకు అనుగుణంగా అంతా వ్యవహరించాలని సూచించారు. అతిక్రమించేవారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా ఉండే విధంగా గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. కోడ్ అమలులో ఉన్నంత వరకు ఎటువంటి పార్టీ జెండాలు, కటౌట్లు పెట్టరాదన్నారు.

**రావికమతం :** పోలింగ్ ముగిసినప్పటికీ ఓట్ల లెక్కింపు జరిగే వరకు స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉందని రావికమతం ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ప్రతి గ్రామంలో ఆటోలో మైక్ ద్వారా కూడ ప్రచారం చేస్తున్నామన్నారు. జూన్ 4వ తేదీ వరకు ముగ్గురికు మించి ఎక్కువ మంది ఒకోచోట గుమిగూడి ఉండరాదన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు వంటివి జరపరాదన్నారు. నిబంధనలను వ్యతిరేకించేవారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి మధుసూధనరావు

**నర్సీపట్నం, మే 18 :** ఇక్కడి సబ్ జైలును నర్సీపట్నం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదనరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సబ్ జైల్‌లోని రిమాండ్ ఖైదీలతో ఆయన మాట్లాడారు. ఏ నేరం చేసి వచ్చారు. ? ఎన్ని రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉంటున్నారు.. ? బెయిల్‌కి దరఖాస్తు చేసుకున్నారా.. ? లేదా అని ఆరా తీశారు. ఎవరైనా బెయిల్‌కు దరఖాస్తు చేసుకోని పక్షంలో మండల న్యాయ సేవాధికార సంస్థ నుంచి సహకారం అందిస్తామని వివరించారు. నేరం చేసి జైలుకు వస్తే కుటుంబం వీధిన పడుతుందన్నారు. మరోసారి ఈ విధంగా జరక్కుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు

**మాకవరపాలెం, మే 18 :** గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని ఎంఈవో మూర్తి అన్నారు. శనివారం ఇక్కడి గ్రంథాలయంలో విద్యార్థులకు విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఏడు రోజులపాటు నిర్వహించనున్న ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

**రోలుగుంట, మే 18 :** ఇక్కడి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం గ్రంథాలయాధికారిణి వరలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. రోలుగుంటతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నలభై మంది వరకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. ఈ తరగతులను అంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా గ్రంథాలయాధికారిణి కోరారు.

## 70 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



పీహెచ్‌సీలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల దృశ్యం

**గొలుగొండ, మే 18 :** చీడిగుమ్మల పీహెచ్‌సీలో శనివారం ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 70 మందికి ఈ పరీక్షలు జరిపారు. అనంతరం ఈ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్యామ్‌కుమార్, ధనుంజయ్, హోమీబాబా ట్రస్ట్ వైద్యులు దుర్గాప్రసాద్, సునీత, పల్లవి, రాధ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు

**మాకవరపాలెం, మే 18 :** మండల కేంద్రం మాకవరపాలెంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. రాజారావుపేట, మాకవరపాలెం బీసీ కాలనీలలో పైప్‌లైన్లు పాడవ్వడంతో పది రోజులుగా ఆయా ప్రాంతాలవారు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇది గుర్తించిన పంచాయతీ కార్యదర్శి బాలదొర అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై వారు స్పందించి పైప్‌లైన్ల మరమ్మతుకు చర్యలు చేపట్టారు.

## గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు



గొండుపాలెంలో మేకలకు వ్యాక్సిన్ వేస్తున్న తేజ

**కె.కోటపాడు, మే 18 :** రానున్న వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి సోకకుండా పెంపకందారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య సహాయకుడు వి.తేజ తెలిపారు. గొండుపాలెంలో శనివారం రెండువందల మేకలు, గొర్రెలకు ఈ వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎంట్రో టాక్సిమియా (ఈటీ) వ్యాక్సిన్‌ను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నుంచి ఆరు నెలల వయస్సు గల మేకలు, గొర్రెలు ఈ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి పరిస్థితి ఏర్పడితే వెంటనే పశువైద్యులను సంప్రదించాల్సిందిగా సూచించారు.

గోవాడ

## ఉపాధి పనుల్లో బోగస్ మస్తర్లు

▸ టీడీపీ, జనసేన నాయకులు ఆరోపణ
▸ సమగ్ర విచారణకు డిమాండ్

**చోడవరం, మే 18 :** మండలంలోని గోవాడ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానిక టీడీపీ, జనసేన నాయకులు ఏడువాక లక్ష్మణకుమార్, ఏడువాక శ్రీనివాసరావు తదితరులు డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనుల్లో అధికార పార్టీకి చెందిన సానుభూతిపరులు పనులకు రాకపోయినా వారికి మస్తర్లు వేస్తున్నారని ఆరోపించారు. అలాగే పనుల కేటాయింపులో సైతం కావాలని ప్రతిపక్ష పార్టీలకు చెందిన మద్దతుదార్ల పట్ల వివక్ష చూపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పనులలో ఉపాధి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులు, మస్తర్లపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.